క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

రైల్వేకోడూరు : మండలంలోని గంగరాజు పురం 220 కేవీ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్నటువంటి 33 కేవీ లైన్స్ హైవే రోడ్డుపై తక్కువ ఎత్తులో ఉండటంతో మరమ్మతులు చేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీ బాస్కర్‌రావు తెలిపారు. దీంతో మంగళవారం (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైల్వేకోడూరు, మ్యాంగో యార్డు, జంగిటివారిపల్లె, శెట్టిగుంట, నాగవరం, తూర్పుపల్లె, బొమ్మవరం, వీవీకండ్రిగ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని పట్టణ, పల్లె ప్రాంతాలకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించవలసిందిగా కోరారు.

నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం 18 వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని సోమవారం ఎంపీడీఓ జాషువా ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ ప్రాంగణంలో జరిగే ప్రజావేదికకు అందరూ హాజరుకావాలని తెలిపారు.

నేడు విద్యాసంస్థల బంద్

రాయచోటి అర్బన్ : విద్యారంగం సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలన్నీ ఈనెల 25న (మంగళవారం) పిలుపునిచ్చిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలును నిలిపివేసి వారి కడుపుకొట్టడం తగదన్నారు. సంఖ్య తక్కువగా ఉన్న కారణంగా ప్రభుత్వ హాస్టళ్లను ఎత్తివేయడం దుర్మార్గమన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న బంద్‌ను విద్యార్థిలోకం విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఏ నేతలు ప్రవీణ్, సాయికుమార్, గణేష్, ప్రభాకర్, నాగ సురేష్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని పెద్ద కారంపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో 26వ తేదీ (బుధవారం) ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నూరు అశ్వర్థామరెడ్డి, మన్నూరు భాస్కర్‌రెడ్డిలు సోమవారం తెలియజేశారు. తమ తండ్రి కీ.శే.కారంపల్లి సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం డాక్టర్ మన్నూరు కేశవరెడ్డి, డాక్టర్ సోనియా, రాజంపేట ప్రముఖ వైద్యులు నాగ చంద్రశేఖరెడ్డిలతో వైద్య సేవలు అందించనున్నట్లు తెలియజేశారు. మహిళలకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులతోపాటు వెన్ను, మోకాళ్ల నొప్పులు, గ్యాస్ట్రబుల్ వంటి వ్యాధులకు వైద్యం అందించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని మండల వాసులతోపాటు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలంటూ కోరారు.


దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



వినయ్‌కు ట్రై సైకిల్‌ను అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల పరిధిలోని గుట్టపల్లె పంచాయతీ బి.వడ్డెపల్లెకు చెందిన ఆర్.వినయ్ అనే విద్యార్థికి బ్యాటరీ ట్రైసైకిల్‌ను అందజేశారు. గడప గడప మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి దివ్యాంగుడైన వినయ్ తీవ్ర ఇబ్బంది పడుతున్నాడని అతనికి ట్రై సైకిల్ అందజేయాలని ఆవుల విష్ణువర్దన్ రెడ్డి, రాష్ట్రకార్యదర్శి, గ్రామసర్పంచ్ చిదంబరంరెడ్డిలు తెలియజేశారు. స్పందించిన శ్రీకాంత్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి వినయ్‌కు బ్యాటరీ ట్రైసైకిల్‌ను మంజూరు చేయించారు. సోమవారం గుట్టపల్లెలో వినయ్‌కు ట్రైసైకిల్‌ను అందజేశారు.

అర్జీదారులకు ఉచిత భోజన సౌకర్యం



భోజనం వడ్డిస్తున్న దాతలు

రాయచోటి టౌన్ : వివిధ సమస్యల పరిష్కారానికి స్పందనకు హాజరయ్యే అర్జీదారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం ఉచిత భోజనం సదుపాయం కల్పించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా 29వ వారానికి చేరుకుంది. దాతల సహకారంతో అర్జీదారులకు మంచి భోజన వసతి అందిస్తున్నారు. ఫిర్యాదుదారులకు భోజనాన్ని అందించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు.

మల్లయ్యకొండపై భక్తుల సందడి

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా సోమవారం భక్తుల సందడి నెలకొంది. భక్తులకు స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి సతీమణి ప్రత్యేక పూజలు జరిపారు.

'సురక్ష' విజయంలో వలంటీర్లది ముఖ్య భూమిక

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి,
జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



అర్హులకు ధృవీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

ఒంటిమిట్ట : వలంటీర్ల కృషి వల్లే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఇంతటి విజయాన్ని సాధించిందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సర్పంచ్ కత్తి సుజాత, ఎంపీటీసీ చెంచుగార్ల సుప్రియ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్గొన్న రాజంపేట ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ఒంటిమిట్ట కోదండ రామాలయం అభివృద్ధిలో భాగంగా తొలగించిన ఒంటిమిట్ట మెయిన్ ఎంపీపీ పాఠశాలకు ప్రత్యామ్నాయంగా స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో టీటీడీ సహకారంతో దాదాపు రూ. 86 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మెయిన్ ఎంపీపీ పాఠశాల భవనాన్ని వారు ప్రారంభించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులై ఉండి ధృవీకరణ పత్రాలు పొందడంలో సమస్యలు ఎదురుకొంటున్న వారికి జగనన్న సురక్షతో విముక్తి కలిగిందన్నారు. అలానే సంక్షేమం పొందని వారికి పథకాలను అందించేందుకు వెసులుబాటు లభించిందన్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా అవినీతికి పాల్పడకుండా స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వలంటీర్లను చూసి కొందరు ఈర్ష్యతో వారిపై లేనిపోని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. వలంటీర్లే లేకపోతే జగనన్న సురక్ష ఇంతటి విజయాన్ని సాధించేది కాదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్లకు, సచివాలయ వ్యవస్థకు ఎప్పటికి అండగా ఉంటుందని, వారే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైన్యం అని అభిప్రాయపడ్డారు. వలంటీర్లను కించపరిచేలా మాట్లాడితే 2024 ఎన్నికల్లో డిపాజిట్‌లు కూడా రావని హెచ్చరించారు. సమగ్రశిక్ష కో-ఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, గజ్జల శ్రీనివాసులరెడ్డి, దున్నూతల రఘురాంరెడ్డి, ఎంపీటీసీ ఎం.నారాయణరెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఎస్.ఎం. రఫీ, సర్పంచ్ ఎం.శివనారాయణ, మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్, ఎంపీడీఓ రెడ్డయ్య, తహసీల్దార్ మాధవీలత, ఏఓ కిరణ్ కుమార్‌రెడ్డి, ఎంఈఓ వెంకట సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల పంపిణీలో పారదర్శకత పాటించండి

నందలూరు(రాజంపేట)/ఒంటిమిట్ట : అసైన్డ్ భూముల పంపిణీలో పారదర్శకత పాటించాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆయా మండలాల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం వేర్వేరు కార్యక్రమాలలో నందలూరు, ఒంటిమిట్ట తహసీల్దారు కార్యాలయాల్లో రెవెన్యూ అధికారులతో అసైన్డ్ భూములపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పంచాయతీలల్లో భూములు సబ్‌డివిజన్ కాలేదని వాటిపై దృష్టి సారించాలన్నారు. వీఆర్‌ఓ, సర్వేయర్ సమక్షంలో వాటిని సబ్‌డివిజన్ అయ్యేలా చూసి ప్రతి పేదవారికి భూమి అందేలా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనిపై అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. అసైన్డ్‌మెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భద్రకాళి సమేతుడికి పల్లకీ సేవ



రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళి సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌లను అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో ఉంచి మాఢ వీధులలో ఊరేగించారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

వీరబల్లె (రాయచోటిటౌన్) : గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టారు. సోమవారం మండల పరిధిలోని దిగువ రాచపల్లె గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ గంగులమ్మ ఆధ్వర్యంలో ఎంపీడీఓ మల్లీశ్వరి వీధులలో పేరుకపోయిన మురుగును తొలగించారు. అనంతరం ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జగదీష్, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దోషులను శిక్షించాలి

మణిపూర్ ఘటనపై ప్రధాని ఎందుకు
మౌనంగా ఉన్నారో చెప్పాలంటూ
ప్రశ్నించిన మహిళా సంఘాలు



నిరసన తెలుపుతున్న మహిళా, విద్యార్థి సంఘాలు

లక్కిరెడ్డిపల్లె : మణిపూర్ ఘటనను నిరసిస్తూ సోమవారం మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లె జూనియర్ కళాశాల ఆవరణలో దోషులను కఠినంగా శిక్షించాలి మానవహారం నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మణిపూర్‌లో మూడు నెలలుగా దాచిపెట్టిన హింస ఒక్కసారిగా బట్టబయలైందని, మే 3వ తేదీన అక్కడ అల్లర్లను మొదలు పెడితే దానిని మూడు నెలలపాటు ప్రపంచానికి తెలియకుండా దాచడంలో మోడీ నాయకత్వం సఫలీకృతమైందని, ఇన్ని దారుణాలు జరుగుతున్నా వాటిని బయటకు తెలియకుండా ఇంటర్నెట్ లేకుండా చేయడాన్ని ఖండించారు. భేటీ బచావో - భేటీ పడావో అనే నినాదాలు ఇవ్వడమే గాని దేశంలో ఆడవారికి భద్రత లేకుండా పోయిందని వాపోయారు. మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలంటూ వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు మర్రి సుమిత్ర, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల వెంకటేశు, విద్యార్థులు పాల్గొన్నారు.

మణిపూర్ మారణకాండ దారుణం

రాజంపేట రూరల్ : మణిపూర్ ఆదివాసి మహిళలపై సామూహిక అత్యాచారం, దాడులకు పాల్పడటం దారుణమని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐడీజేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయరాజ్ కోరారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలోని పరిపాలన అధికారి(ఏఓ) జ్ఞానేశ్వరికి ఐడీజేఎస్ ప్రతినిధులతో కలిసి జయరాజ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎం.రామ్మోహన్, తేజం రవిచంద్రప్రసాద్, పోతురాజు దివాకర్, సునీల్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి శ్మశాన భూమిని కాపాడండి

రాయచోటి అర్బన్ : తమకు చెందిన శ్మశాన భూమిని కాపాడాలని సీపీఎం అన్నమయ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఓబులవారిపల్లె మండలం వై.కోట గ్రామం కొత్త అరుంధతివాడ దళితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాను నిర్వహించారు. ధర్నాలో గ్రామస్తులు మాట్లాడుతూ దళితులకు శ్మశానం కోసమంటూ కేటాయించిన భూమిని పెద్దల అండదండలతో తమ గ్రామానికే చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. వారి నుంచి తమ శ్మశాన భూమిని కాపాడి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గిరీషా పీఎస్‌కు వినతిపత్రం అందించారు. సీపీఎం నేతలు రామచంద్ర, వెంకటాచలపతి, పెంచలయ్యతోపాటు కొత్త అరుంధతివాడకు గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భుజంగేశ్వర ఆలయంలో సోమవారం అర్చకులు చైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం జరిగిన రుద్రాభిషేకంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సేవకు సలాం



నిస్సాహాయుల సేవే లక్ష్యంగా..



ఈశ్వరయ్యకు చెక్కును అందిస్తున్న వలంటీర్ నరసింహులు తదితరులు

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి వలంటీర్ బట్టు నరసింహులు. నిస్సాహాయకులకు సేవ చేయడమే లక్ష్యంగా పని సేవ చేస్తున్నాడు. తన పరిధిలో చింతలచెలిక అరుంధతివాడకు చెందిన పిల్లిపోగు ఈశ్వరయ్యది పేద కుటుంబం. కడుపు నొప్పితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేశాడు. దీంతో ఆ కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా చేసి ఆదుకున్నాడు. అలానే తన పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ పథకాలను అందిస్తూ అండగా నిలుస్తున్నాడు. లాక్‌డౌన్ సమయంలో గ్రామంలో పారిశుధ్య పనులతోపాటు కోవిడ్ పట్ల అవగాహన తదితర సేవలు అందిస్తూ అందరి మన్ననలను పొందాడు.

– చిట్వేలి

వలంటీర్ ఆదుకున్నాడు



తాను అనారోగ్యంతో అప్పు చేసి చికిత్స చేయించుకున్నానని, అప్పు చెల్లించలేక అవస్థలు పడుతున్న సమయంలో వలంటీర్ నరసింహులు సీఎం సహాయనిధి నుంచి రూ. 15 వేలు మంజూరు చేయించి అప్పుల బాధ నుంచి తప్పించాడు. కోవిడ్ సమయంలో ఏ అవసరమున్నా ముందుండి సేవలు అందించాడు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం జగనన్నకు వలంటీర్ నరసింహులుకు కృతజ్ఞతలు తెలిపారు.

– ఈశ్వరయ్య, చింతచెలిక, చిట్వేలి

దివ్యాంగుడి కుటుంబానికి ఎనలేని సేవలు



రెడ్డప్పకు పింఛన్ అందచేస్తున్న వలంటీర్ ఆరీఫ్

మున్సిపాలిటీ పరిధిలోని సరస్వతీపురం వీధిలో నివాసముంటున్న రెడ్డప్ప పుట్టుకతోనే దివ్యాంగుడు. రెడ్డప్ప తండ్రి డాక్టర్ కృష్ణ బ్రతికున్నప్పుడు రెడ్డప్పకు ఎంతో సహాయంగా ఉండేవారు. వృద్ధురాలైన తల్లి ఒకవైపు కుమారుడిని చూసుకుంటూ, మరోవైపు ఇంటి అవసరాలకు అవసరమయ్యే చిన్నపాటి వస్తువులను తీసుకొచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతుండేది. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారు. ఆరీఫ్ అనే వలంటీర్ ఆ కుటుంబానికి పెద్ద సహాయకుడిగా మారాడు. ఆరీఫ్ కేవలం పింఛన్ ఇవ్వడంతోనే తన పని పూర్తయిందనుకోకుండా రెడ్డప్ప బయటకు వెళ్లలేనందున బయట నుంచి ఏ వస్తువు కావాలన్నా వలంటీర్ ఓ స్నేహితుడిలా తెచ్చి ఇస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నాడు. ఇక కరోనా సమయంలో ఆరీఫ్ రెడ్డప్ప కుటుంబానికి చేసిన సేవలు ఎనలేనివనే చెప్పాలి.

– రాజంపేట టౌన్

సీఎం జగన్ దేవుడితో సమానం



వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్ మాలాంటి వారికి దేవుడిలాంటి వారు. మా అమ్మ వృద్ధురాలు, నేను ఇతరుల సహాయం లేనిదే మంచం మీద నుంచి కిందకి దిగలేను. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న తమకు వలంటీర్ ఆరీఫ్ ఎంతో సహాయపడుతున్నాడు. వలంటీర్ లేకుంటే మేము చాలా ఇబ్బందులు పడేవాళ్లం. థాంక్యూ సీఎం సర్.

– రెడ్డప్ప, సరస్వతీపురం, రాజంపేట

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయండి

రాయచోటి అర్బన్ : పట్టణంలో రింగురోడ్డు వద్ద నుంచి ఠాణా వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా కోరారు. సోమవారం సాయంత్రం ఆయన వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్‌తో కలసి రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి మాట్లాడారు. రోడ్డు విస్తరణతో ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందన్నారు. ఆక్రమణలను తొలగించాలన్నారు. అడ్డుచెప్పేవారికి అన్ని రకాలుగా సమాధానపరచి, ఒప్పించిన అనంతరం పనులు కొనసాగించాలన్నారు. పనులను నాణ్యవంతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొలిమి హరూన్ బాషా, రౌనఖ్‌హుస్సేన్, అల్తాఫ్, గౌస్‌ఖాన్, వైఎస్ఆర్‌సీపీ నేతలు రియాజ్ అహమ్మద్, ఇర్ఫాన్, ఫయాజ్ అహమ్మద్, ఆరిఫుల్లాఖాన్, యూసూఫ్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఆర్ఐ మల్లికార్జున, ఆర్అండ్‌బీ, మున్సిపల్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనులను పూర్తి చేయండి

రాయచోటి అర్బన్ : వెలిగల్లు జలాశయం కాలువలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. కాలువల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్న డిమాండ్‌తో రైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా కాలువల నిర్మాణం పూర్తిచేయకపోవడంతో రైతులకు సాగునీరందడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ప్రాజెక్టు కాలువలు పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి



లక్కిరెడ్డిపల్లె: తహసీల్దార్‌తో చర్చిస్తున్న ఎంపీపీ

లక్కిరెడ్డిపల్లె : స్పందనలో ఫిర్యాదు చేసిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి తహసీల్దార్ ఉదయ్ శంకర్‌రాజుకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూ సమస్యలపై చాలాకాలం నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారని, వారి సమస్యకు స్థానిక వీఆర్‌ఓలతో చర్చించి ఎప్పటికప్పుడు పరిష్కారం చూపే విధంగా కృషి చేయాలన్నారు. సయ్యద్ అమీర్, ఉపసర్పంచ్ రాజారెడ్డి, సంజీవరెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, సిద్దక నాగిరెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ, జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు తక్షణ పరిష్కారం

రైల్వేకోడూరు : స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీకి నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని తహసీల్దారు రామ్మోహన్ తెలిపారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మండల నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా ఆయా శాఖల అధికారులు పరిష్కారం చూపాలన్నారు. స్పందనలో ఎక్కువగా వ్యవసాయ భూములకు సంబంధించిన ఫిర్యాదులే వచ్చాయన్నారు. స్పందన వినతులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీఆర్‌ఓలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బైక్, ఆటో ఢీ



ప్రమాదంలో గాయపడిన శివప్రసాద్‌నాయుడు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మృకుండాశ్రమం సమీపంలో ఉన్న శ్రీ సాయి కాశేశ్వర కళాశాల ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై సోమవారం బైక్, టాటా మ్యాక్స్ మినీ లగేజ్ ఆటో ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు భాకరాపేట పంచాయతీ పెద్దపల్లి గ్రామానికి చెందిన వెంకట శివ ప్రసాద్ నాయుడు(30) బైక్‌పై ఒంటిమిట్ట నుంచి భాకరాపేటకు వెళుతుండగా ప్రొద్దుటూరు నుంచి రాజంపేట వైపు వెళుతున్న టాటా మ్యాక్స్ మినీ ఆటో ను ఢీ కొటి దీంతో బైక్ పై వెళుతున్న శివ ప్రసాద్‌కు గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

పశువులకు పౌష్టికాహారంతో పాలదిగుబడి

గాలివీడు : పశువులకు పౌష్టికాహారం అందించడంతో పాలదిగుబడి పెంచుకోవచ్చునని మండల పశువైద్యాధికారి భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గోరాన్‌చెరువు రైతు భరోసా కేంద్రంలో రైతులతో కలిసి పశువిజ్ఞాన బడి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ పశువులయదకు రాకపోవడం, తిరిగి పొర్లడం వంటి సమస్యలు నివారించడంతోపాటు పాలదిగుబడి, రైతుల ఆదాయాన్ని పెంచడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. రైతులు పశువులకు తగిన పౌష్టికాహారాన్ని, మినరల్ మిక్చర్, నట్టల నివారణపై చర్యలు తీసుకోవాలన్నారు. చూలు నిలవకపోతే వెంటనే పశువైద్యుల సలహా మేరకు చికిత్స చేయించాలన్నారు. అనంతరం పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. పశువంర్ధకశాఖ సహాయకులు రఘునాథ్, రైతులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే



సర్వేలో పాల్గొన్న ఆర్‌ఓ భాస్కర్, రెవెన్యూ సిబ్బంది

ఓబులవారిపల్లె : నూతనంగా ఓటుహక్కు పొందిన వారు తమ ఓటును బీఎల్‌ఓలు వద్ద నమోదు చేసుకోవాలని రైల్వేకోడూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ముదినేపల్లి దళితవాడ గ్రామంలో ఆర్డీఓ భాస్కర్ తహసీల్దార్ పుల్లారెడ్డిలు సిబ్బందితో కలిసి ఓటరు జాబితాపై ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఓటరు జాబితాలో తప్పులను సరిదిద్దుకునేందుకు బీఎల్‌ఓలను సంప్రదించాలన్నారు. అదే విధంగా కొత్తగా ఓటుహక్కు పొందాలనుకునే అర్హులు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం పలు విషయాలపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. ఆర్‌ఐలు రామ్మోహన్ నాయుడు, సదానందస్వామి, వీఆర్‌ఓ హరి, బీఎల్‌ఓలు రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : ఓటరు జాబితాపై ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. సోమవారం ఆయన బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు నిర్వహించే సర్వేలో వివిధ రకాల మార్పులు ఓటరు తొలగింపు పనులను పకడ్బందీగా జరపాలన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు ఎన్ని కుటుంబాలు తిరిగారు, ఎన్ని ఓటర్లపై సర్వే చేశారన్న రిపోర్టు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆర్‌ఐ చంద్రమోహన్ రెడ్డి, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సమాన వేతనం అమలుచేయాలి



మాట్లాడుతున్న సీహెచ్ చంద్రశేఖర్ రెడ్డి

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ కార్మికులకు సమానపనికి సమానవేతనం అమలు చేయాలని ఏపీఎండీసీ జేఏసీ పోరాట కమిటీ అడ్వైజర్ సీహెచ్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఏపీఎండీసీ ప్రాంగణంలో జేఏసీ పోరాట కమిటీ ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎండీసీ యాజమాన్యం సమానపనికి సమానవేతనం 80శాతం అమలు చేసిందని, మిగిలిన 20శాతం ఉద్యోగులకు కూడా పూర్తిచేయాలన్నారు. డీఏ అరియర్స్‌లను చెల్లించాలని, మైనింగ్ చట్టం ప్రకారం కార్మికులకు ఇవ్వాల్సిన ఈఎల్ సెలవులు వర్తిపజేయాలని, ఫిబ్రవరి, మార్చినెలల్లో రూ. 16 లక్షలు పెండింగ్‌లో ఉన్న కార్మికుల హెల్త్ ఇన్సూరెన్సు బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. జేఏసీ అడ్వైజర్ డి.శ్రీనివాస రావు, పోరాట జేఏసీ కన్వీనర్ ఆర్.వెంకటేష్, కార్యదర్శి బండారు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

కడప రూరల్ : రజకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని రజక సంఘాల సమైఖ్య జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో రజకులు వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాజకీయ ప్రాధాన్యత కల్పించినప్పుడే ప్రగతి సాధ్యపడుతుందని అన్నారు.

యూపీఎస్సీ విజేతకు అభినందన



ధర్మానాయక్‌ను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖ పూర్వ విద్యార్థి బి. ధర్మానాయక్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య అభినందించారు. ధర్మానాయక్ యూపీఎస్సీ నిర్వహించిన ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్, మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ శాఖలో సీనియర్ గ్రేడ్ గెజిటెడ్ ఆఫీసర్ పోస్టుకు ఎంపికైన సందర్భంగా సోమవారం ఈయన్ను అభినందించారు. కార్యక్రమంలో జర్నలిజం శాఖాధిపతి డా. టి.శ్యామ్‌స్వరూప్, అధ్యాపకులు డా. టి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

గాలివీడు : మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతను ఇస్తున్నట్టు వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి , జేఏసీ కన్వీనర్ ఖాదర్‌మొద్దీన్(ఎస్‌కే)లు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యలకు పరిష్కారానికి ప్రభుత్వం రూ. 20 లక్షలను కేటాయించిందన్నారు. మండల కేంద్రంలోని న్యూ డీలక్స్ వీధిలో సుమారు రూ. 6లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంగళవారం నిర్మాణ పనులను నాయకులు, కార్యకర్తలతో కలసి వారు ప్రారంభించారు.